

స్వర్ణరథంపై విహరించిన ఏకదంతుడు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారు సిద్ధిబుద్ధి సమేతుడై స్వర్ణరథంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ ఆదివారం రాత్రి భక్తులను కటాక్షించారు. ఉత్సవమూర్తులకు ఆలయ అలంకార మండప వేదిక వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వర్ణ రథంపై అధిష్ఠింపజేశారు. ఆపై గణేశ నామస్మరణల నడుమ ఊరేగించారు. ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల, న్యూస్‌టుడే: టికెట్లు లేకుండా ఆదివారం సాయంత్రానికి తిరుమల వచ్చిన భక్తులకు దాదాపు 8 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల భక్తులకు 3 గంటలు పడుతోంది. శనివారం శ్రీవారిని 80,741 మంది దర్శించుకున్నారు. రూ.3.45 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

చిత్తూరు గ్రామీణంలో

60.9 మి.మీ. వర్షపాతం

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శనివారం రాత్రి జిల్లాలోని 28 మండలాల్లో భారీ నుంచి తేలికపాటి వర్షం కురిసింది. అత్యధికంగా చిత్తూరు రూరల్ మండలంలో 60.9 మి.మీటర్లు కురవగా.. అత్యల్పంగా నగరిలో 2.2, ఐరాల 56.4, చిత్తూరు 41, తవణంపల్లె 37.4, గంగాధరనెల్లూరు 37, పూతలపట్టు 36.2, బైరెడ్డిపల్లె 34.8, సదుం 32.6, యాదమరి 31.6, పెనుమూరు 31.4, గుడిపాల 23, పెద్దపంజాణి 22.6, ఎస్‌ఆర్‌పురం 22.4, బంగారుపాళ్యం 21.4, పులిచెర్ల 21, చౌడేపల్లె 20.6, పుంగనూరు 18.4, సోమల 17.6, శాంతిపురం 16.4, గుడుపల్లె 14.2, వి.కోట 13.2, కుప్పం 13, పాలసముద్రం మండలంలో 10.6 మి.మీ. వర్షపాతం నమోదైంది.



అనర్హుల ఏరివేత.. అర్హులకు భరోసా

◆ కొత్త పింఛన్లకు వేలమంది నిరీక్షణ | ◆ త్వరలో జారీకానున్న మార్గదర్శకాలు

➠ ఎస్.ఆర్.పురం మండలం, మాగుంట పంచాయతీకి చెందిన మాలిని(32) దివ్యాంగ పింఛను రూ.6 వేలు తీసుకుంటోంది. పింఛను ఐడీ 11000153553. ఆమెకు ఎడమ చేతి చిటికెన వేలు లేదు. నిబంధనల ప్రకారం ఆమెకు ఐదుశాతం వైకల్యం ఉన్నట్లు సదరం ధ్రువపత్రం ఇవ్వాల్సి ఉండగా 46% ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. స్థానిక ఎంపీడీవో ఈనెల పింఛను ఆపేసి ఉన్నతాధికారుల పరిశీలనకు పంపారు. దీంతో ఆమె కలెక్టర్‌ను కలిసి తనకు అర్హత ఉన్నా ఆపేశారని ఫిర్యాదు చేశారు. అయితే ఆమెకు దివ్యాంగురాలి పింఛను తీసుకునే అర్హత లేదని అధికారులు స్పష్టం చేశారు.

➠ యాదమరి మండలం తెల్లరాళ్లపల్లి పంచాయతీలో రెండు నెలల కిందట డీఆర్‌డీఏలోని పింఛన్ల విభాగం ఏపీవో రవి విభిన్న ప్రతిభావంతుల పింఛను పొందుతున్న 11 మంది వివరాలు పరిశీలించారు. వారిలో ముగ్గురు మాత్రమే అర్హులు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన వారి వివరాలు ఉన్నతాధికారులకు నివేదించారు.

- న్యూస్‌టుడే, చిత్తూరు (జిల్లా పంచాయతీ)

రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో సామాజిక పింఛన్లదే అగ్రస్థానం. వైకాపా హయాంలో తగిన అర్హతలు ఉండీ ఏళ్లతరబడి మంజూరుకాని వారంతా ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ విధానాలతో అనర్హులకూ పెద్దఎత్తున పింఛన్లు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో అనర్హులను గుర్తించి వారిస్థానంలో అర్హులకు ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల వివరాలు పరిశీలిస్తున్నారు. జిల్లాలో మాత్రం ఇంకా ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ప్రభుత్వం నుంచి కొత్త పింఛన్ల మంజూరుకు ఎప్పుడెప్పుడు మార్గదర్శకాలు విడుదలవుతాయా అని దరఖాస్తుదారులు నిరీక్షిస్తున్నారు.

◆ జిల్లాలో 35,643 మంది దివ్యాంగులు నెలనెలా రూ.6 వేలు తీసుకుంటున్నారు. వీరిలో 20 శాతం మంది అంటే ఏడువేలకు పైగా అనర్హులు ఉన్నట్లు అధికారుల అంచనా.

◆ పక్షవాతంతో మంచంలో ఉన్న 1,037 మంది పింఛను తీసుకుంటుండగా, వీరిలో 25 శాతం మందికి నయమైనా కొనసాగిస్తున్నారు.

◆ వివిధ విభాగాల్లో 35 వేలమందికి పైగా అనర్హులకు మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

◆ ఒంటరి మహిళ విభాగంలో అనర్హులకు లబ్ధి చేకూర్చినట్లు ఆరోపణలు అనేకం.

ఆరంచెల పేరిట

తెదేపా, జనసేన, భాజపా సానుభూతిపరుల పింఛన్లను ఆరంచెల తనిఖీ పేరుతో గతంలో పెద్దఎత్తున తొలగించారు. మరికొందరికి అర్హత ఉన్నా ఆధార్ కార్డుల్లో వయసు నమోదు, ఇతర అంశాల్లో పొరపాట్ల కారణంగా పొందలేకపోయారు.

50 ఏళ్లు దాటిన వారిలో ఆశలు

కొత్తవాటి కోసం 25 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అనర్హులకు రద్దు చేస్తే, అర్హులైన వారందరికీ మంజూరు చేసే అవకాశం ఉంటుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఎన్నికల హామీ మేరకు 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పింఛన్లు మంజూరు చేస్తారని ఆశావహులు ఉండగా, ప్రభుత్వ మార్గదర్శకాలు వస్తేనే దరఖాస్తులు స్వీకరిస్తామని డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు.

అనర్హులు ఉంటే రద్దు

పింఛన్ల పరిశీలనకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు. ఎక్కడైనా అనర్హులు పింఛను పొందుతున్నారని తమ దృష్టికి వస్తే పరిశీలించి రద్దు చేస్తున్నాం. ప్రస్తుత లబ్ధిదారుల్లో పలువురు అనర్హులు ఉన్నట్లు కొన్నిచోట్ల ఫిర్యాదులు అందుతున్నాయి.

– రవికుమార్ నాయుడు, పీడీ, డీఆర్‌డీఏ

జిల్లాలో మొత్తం పింఛన్లు 2,70,543

వృద్ధాప్య	దివ్యాంగులు	వితంతు	ఒంటరి మహిళలు	ఇతరులు
1,43,264	35,643	59,848	5,741	26,047



లద్దిగం చెరువు తోడేశారు

◆ యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు

◆ 60 అడుగుల లోతువరకు తవ్వకాలు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: పుంగనూరు-చౌడేపల్లె మండలాల సరిహద్దులోని లద్దిగం చెరువు రూపురేఖలు మార్చేశారు. ఇసుక కోసం పెద్దఎత్తున గుంతలు తవ్వేయడంపై ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 700 ఎకరాల విస్తీర్ణంలోని ఈ చెరువులో పెరిగే తుమ్మచెట్ల ద్వారా లద్దిగం పంచాయతీకి ఏటా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. చెరువు కింద 1400 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రభుత్వ అనుమతులు లేకుండా కొందరు అక్రమార్కులు ఇష్టానుసారంగా చెరువును తోడేస్తున్నారు. ఏతూరు, లద్దిగం, పుదిపట్ల, తిరుమణిపల్లె, బంట్లపల్లె, అంకుతోటపల్లె పంచాయతీల ప్రజలు ఈ చెరువుపైనే ఆధారపడ్డారు.

■ ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. లద్దిగం చెరువులో ఇసుక తవ్వకాలు జరుగుతున్న విషయం తెలిసింది. ఆర్‌ఐ, వీఆర్వోలు పరిశీలించారు. వాహనాలు సీజ్ చేశాం. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చౌడేపల్లె తహసీల్దారు హనుమంతు తెలిపారు.

నాలుగెకరాల్లో తవ్వారు

పైపైన ఇసుక తీస్తున్నారని అనుకున్నాం. ఆరు హిటాచీలతో తవ్వడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో తవ్వారు. అధికారులు స్పందించి ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలి. రోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తోంది. 60 అడుగుల లోతు వరకు తవ్వారు. ఏడు గ్రామాల ప్రజలకు ఆధారమైన చెరువును రక్షించాలి.

- రాజశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గ్రామస్థులు



యంత్రాలతో తోడటంతో ఇలా..



నీటి ఊటను ఖాళీ చేస్తూ..

నోటిఫికేషన్ వివరాలు సేకరించిన విజిలెన్స్

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఉద్యోగ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలను విజిలెన్సు అధికారులు సేకరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి ప్రభావతీదేవిని కలిసిన అధికారులు 2019 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారు.. ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు.. నిబంధనలు పాటించారా..? అని వివరాలు సేకరించారు. కార్యాలయ అధికారులు గతంలోనే నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు సమర్పించి ఉండటంతో అవే వివరాలను విజిలెన్సు అధికారులకు ఇప్పుడూ అందజేశారు. ఈ సమాచారంలో సందేహాలు ఉంటే మళ్లీ వస్తామని, తమ విచారణకు సహకరించాలని విజిలెన్స్ అధికారులు కోరగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అంగీకరించారు.

పట్టు రైతులకు సాగు ప్రోత్సాహం పెంపు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: నూతనంగా పట్టు సాగు చేపట్టే రైతులకు సాగు ప్రోత్సాహక నగదును పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పట్టు పరిశ్రమ శాఖ జేడీ శోభారాణి తెలిపారు. కొత్తగా పట్టు సాగు చేపట్టిన జనరల్ రైతులకు ఎకరాకు అందజేసే ప్రోత్సాహక నగదును రూ.18,500 నుంచి రూ.22,750కు పెంచారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.22,500 నుంచి రూ.27,500కు పెంచారని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది పట్టు సాగు లక్ష్యం మూడువేల ఎకరాలని.. ఇప్పటికి 1500-1700 ఎకరాలు విస్తరించామన్నారు. సాగు ప్రోత్సాహక పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



- న్యూస్‌టుడే, చిత్తూరు కలెక్టరేట్

వృత్తి నైపుణ్యం.. ఉపాధికి మార్గం

■ పీఎం ఇంటర్న్‌షిప్‌నకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ■ ప్రముఖ సంస్థల్లో శిక్షణ

విద్యార్థులు చదువుతోపాటు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకుంటే మెరుగైన ఉపాధి, ఉద్యోగావకాశాలు సాధించొచ్చు.. నిరుద్యోగ యువత ఉజ్వల భవితను పొందాలనే సదాశయంతో కేంద్ర పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని తీసుకొచ్చింది.. ప్రముఖ సంస్థల్లో శిక్షణ పొంది నైపుణ్యాలు పెంచుకునేందుకు ఈనెల 12 నుంచి పేర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.. జిల్లాలోని కళాశాలలు, ఐటీఐలు, ఇంటర్, డిప్లొమా చదివే 55 వేలకుపైగా విద్యార్థులకు ఇదొక సువర్ణావకాశమే.

అర్హులెవరంటే..?

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునేవారు పదో తరగతి, ఇంటర్, బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ పూర్తిచేసి ఉండాలి. ఐటీఐ, డిప్లొమా సైతం పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకానికి 21 నుంచి 24 ఏళ్ల లోపువారు దరఖాస్తు చేసుకోవచ్చు. కేంద్ర మంత్రిత్వశాఖ www.pminternship.mca.gov.in ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఆధార్ అనుసంధానమైన చరవాణి నంబరు, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అభ్యర్థి ప్రొఫైల్‌లో ఈకేవైసీ పూర్తిచేయాలి. వ్యక్తిగత వివరాలు, విద్యార్హత, చిరునామా, కేటగిరీ, ఈమెయిల్ ఐడీ, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలి.

ఏయే పత్రాలు కావాలంటే..?

ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విద్యార్హత, నేటివిటీ సర్టిఫికెట్ ఉండాలి. అయిదింటిలో ఏదైనా ఒకటి ఎంపిక చేసుకోవచ్చు. ఎంపికైతే మీ మెయిల్‌కు ఆఫర్ లెటర్ వస్తుంది. వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సందేహాల నివృత్తికి: హెల్ప్ లైన్ నంబర్: 18001 16090కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చు.

ముఖ్యమైన తేదీలు..

దరఖాస్తు ప్రారంభం: అక్టోబరు 12. చివరి తేదీ: ఈనెల 25లోగా. జాబితా విడుదల : ఈనెల 26. ఎంపిక : ఈనెల 27 నుంచి నవంబరు ఏడో తేదీ వరకు. అభ్యర్థి అంగీకారానికి గడువు: నవంబరు ఎనిమిదో తేదీ నుంచి 15వ తేదీ లోగా. ఇంటర్న్‌షిప్ ప్రారంభం: డిసెంబరు రెండో తేదీ.

ఎంపిక ప్రక్రియ ఇలా..

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఆబ్జెక్టివ్ పరీక్ష నిర్వహిస్తారు. అర్హులైన అభ్యర్థులు పీఎం ఇంటర్న్‌షిప్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులు పూర్తి వివరాలు నమోదు చేయాలి. ఎంపికైన వారికి.. వారు ఎంచుకున్న పరిశ్రమలకు సంబంధించి నైపుణ్యాలు నేర్పుతారు. అర్హత సాధించిన వారికి ప్రధాన మంత్రి సురక్ష బీమా కవరేజ్ అవకాశం ఉంది.

వేటిని అందిస్తారంటే..

పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్ అండ్ ఎనర్జీ, మైనింగ్, టెలికాం, రిటైల్, సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్, ఫార్మాస్యూటికల్, ఏవియేషన్, మాన్యుఫాక్చరింగ్, అగ్రికల్చర్, టూర్వెల్ హాస్పిటాలిటీ తదితర రంగాల్లో ఇంటర్న్‌షిప్ అందిస్తారు.

భృతి ఇలా..

ఎంపికైన వారికి 12 నెలల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు వన్‌టైం గ్రాంటు కింద రూ.6 వేలు, ప్రతి నెలా ప్రభుత్వం రూ.4,500, కంపెనీ రూ.500 చొప్పున డీబీటీ ద్వారా జమ చేస్తారు. ఈ లెక్కన ఏడాదికి రూ.66 వేలు పొందే అవకాశం ఉంది.

జిల్లాలో విద్యార్థుల సమాచారం

ఇంటర్ ప్రథమ : 25,426 | ఇంటర్ ద్వితీయ : 26,582

ఐటీఐ : 8,100 | పాలిటెక్నిక్ : 5,200 | డిగ్రీ విద్యార్థులు : లక్ష మందికిపైగా

టమాటా ధరల్లో ఊగిసలాట

రైతుల్లో ఆందోళన

పుంగనూరు, న్యూస్‌టుడే: టమాటా రైతుల్లో ఆందోళన నెలకొంది. రాష్ట్రంలో గత ఏడాది కిలో రూ.200 పలకగా ఈ ఏడాది రూ.70 మించలేదు. వారం పది రోజులుగా ధరలు దిగొస్తున్నాయి. ఓవైపు తోటలు వైరస్ ప్రభావంతో దెబ్బతినగా మరోవైపు వర్షాలతో పూత, పిందె రాలిపోయాయి. సీజన్ ప్రారంభం నుంచి ధరలు ఆశాజనకంగా ఉండటంతో వందలాది ఎకరాల్లో పంటను సాగు చేశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోనే గాకుండా గుజరాత్, హరియాణా తదితర రాష్ట్రాల్లోనూ టమాటా సాగు చేస్తారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది పొడవునా సాగు చేయడానికి అనుకూల వాతావరణం ఉంది. ప్రస్తుతం అనంతపురం, తమిళనాడులోని ఉడుములపేట, సత్రం ప్రాంతాల్లో దిగుబడులు ప్రారంభం కావడంతో ధరలు తగ్గుతున్నాయి.

● పదిహేను రోజుల కిందట 15 కిలోల పెట్టె రూ.950 నుంచి రూ.వెయ్యి వరకు విక్రయించారు. ప్రస్తుతం రూ.550- 650 మాత్రమే పలుకుతోంది. పుంగనూరు, పలమనేరు, వి.కోట నుంచి పొరుగు రాష్ట్రంలోని వివిధ పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు.



పుంగనూరు మార్కెట్‌లో వ్యాపారుల కొనుగోళ్లు

● మొక్కలను రెట్టింపు ధరలకు విక్రయించడం, దిగుబడులు పెరగడానికి మందులు, ఎరువులకు రూ.వేలల్లో వెచ్చించాల్సి వస్తోంది. బిందు సేద్యం, కట్టెలు నాటడం, దారం కట్టడం వంటి అదనపు ఖర్చులు సైతం పెరిగాయి.

రెండు ఎకరాల్లో సాగుచేశా

రెండు ఎకరాల్లో టమాటా సాగుచేశా. రూ.2 లక్షల వరకు ఖర్చుచేశా. వైరస్ ప్రభావంతో పిందె దశలోనే తోట దెబ్బతింది. ఇప్పటివరకు రూ.లక్ష ఆదాయం వచ్చింది. వైరస్ ప్రభావంతో రెండు, మూడు కోతల్లో ఐదు క్వింటాళ్లు మించి రావు.

- చంద్ర, రైతు, పుంగనూరు

ఏడుకొండల దారిలో

ఇదేమి పరీక్ష గోవిందా..!

చినుకుపడితే మురుగు కూపంగా ఏపీఎస్‌ఆర్టీసీ బస్టాండు

కలగా కేంద్రం ఆధునికీకరణ

తిరుపతి (ఆర్టీసీ), న్యూస్‌టుడే:

తిరునగరికి విచ్చేసే లక్షల మంది భక్తులు ఇక్కడ కాలుమోపాలంటేనే సంశయించాల్సి వస్తోంది. చినుకు జాడ పడగానే ఏపీఎస్‌ఆర్టీసీ ప్రాంగణం మురుగు కూపాన్ని తలపిస్తుండటంతో భక్తుల ఒళ్లు జలదరిస్తోంది. ఎంతో నిష్ఠతో ఇక్కడికి వస్తే ఆదిలోనే ఈ విషమపరీక్ష ఏమిటి గోవిందా.. అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లగేజీ, పిల్లాపాపలు, వృద్ధులను మురుగు దాటించడానికి తంటాలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ప్రాంగణం ఆధునికీకరణ పనులు పట్టాలెక్కించాలంటూ విన్నవిస్తున్నారు.

తిరుపతి పరిసరాల్లోని పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు, శ్రీవారి ఆలయ సందర్శనానికి వెళ్లే 60 శాతం మంది భక్తులు బస్సులనే ఆశ్రయిస్తుంటారు. తిరుపతి బస్‌స్టేషన్ వేదికగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యంగల ప్రాంగణం లోతట్టు ప్రాంతంలో ఉండటంతో చినుకుపడితే చాలు చెరువును తలపిస్తోంది. వర్షపునీరు మొత్తం ఏడుకొండలు బస్టాండ్ వద్దకు చేరుతోంది. తిరుమల నుంచి వచ్చే బస్సులన్నీ ఇక్కడే నిలిపివేస్తుండగా పక్కనే ఉన్న శ్రీహరి, శ్రీనివాస బస్టాండ్లు, రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు వర్షపునీటిలోనే నడిచి వెళ్లాల్సిన దుస్థితి. కేంద్రీయ బస్‌స్టేషన్ ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినప్పటికీ, టెండర్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. 15 అంతస్తులు, 100 ప్లాట్‌ఫామ్‌లు, మాళ్లు, ఇతర వసతులతో రూ.500 కోట్లతో నిర్మించడానికి ప్రణాళిక రూపొందించారు. టెండర్ ఆలస్యం కావడంతో సమస్యలు పెరుగుతూ సత్వర పరిష్కారం కరవైంది.



వర్షంనీటితో ఆర్టీసీ బస్టాండు

తిరుపతి బస్ స్టేషన్ ఇలా..

- మొత్తం బస్టాండ్లు : 4
- ప్లాట్‌ఫాంలు : 64
- బస్సుల రాకపోకలు : 2,700
- ప్రయాణికుల రాకపోకలు : 1.15 లక్షలు

పరిష్కారానికి చర్యలు

వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉంటున్నాం. నీరు నిలిచిన వెంటనే బయటకు పంపే చర్యలు తీసుకుంటున్నాం. వర్షం గంటల తరబడి పడే సమయంలోనే కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– డి.రామచంద్రనాయుడు, బస్‌స్టేషన్ ఏటీఎం



జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వీసీ ఆచార్య దొరస్వామి తదితరులు

వర్సిటీలు స్వయం సమృద్ధి సాధించాలి

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: విశ్వవిద్యాలయాలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. తెదేపా అధికారంలోకి వచ్చిన వెంటనే వర్సిటీ అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తున్నామన్నారు. ఆర్థిక స్వయం సమృద్ధిలో భాగంగా జిల్లాలోని డిగ్రీ కళాశాలలను వర్సిటీకి అనుసంధానం చేసేందుకు కృషి చేస్తామన్నారు. వర్సిటీలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, వెటర్నరీ కళాశాలలు ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ఉపకులపతి ఆచార్య దొరస్వామి మాట్లాడుతూ.. వర్సిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలను రూపొందించామన్నారు. కడ ప్రాజెక్ట్ అధికారి వికాస్ మర్మత్, ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పి.ఎస్.మునిరత్నం, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్, అకడమిక్ డీన్ ఆచారి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర గణపతి వ్రతం


వ్రతంలో పాల్గొన్న భక్తులు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా ఆదివారం ఉదయం, సాయంత్రం శాస్త్రోక్తంగా నిర్వహించిన సామూహిక సంకటహర గణపతి వ్రతంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సిద్ధిబుద్ధి సమేతుడైన వరసిద్ధి వినాయకస్వామి వారి ఉత్సవమూర్తులను పుష్పాలంకరణ చేసి అర్చకులు, వేద పండితులు వ్రతాన్ని నిర్వహించారు. ఈవో పి.గురుప్రసాద్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(జిల్లాపరిషత్), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గుంటూరులోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ప్రశాంతంగా జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా జి.మోహన్‌గోపాలకృష్ణ (రాష్ట్ర సచివాలయం), ప్రధాన కార్యదర్శిగా బి.సి.శంకర్‌నాయక్ (కర్నూలు) కోశాధికారిగా బి.సురేష్‌బాబు (ప్రకాశం), సహాధ్యక్షుడిగా ఏసుబాబు (కృష్ణా), ఉపాధ్యక్షులుగా బి.చిన్నారావు (పశ్చిమ గోదావరి), బి.బ్రహ్మానందరెడ్డి (కర్నూలు), వి.చంద్రశేఖర్ (గుంటూరు), మహమ్మద్ జాకిర్ (అనంతపురం), కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్ఎస్‌కే శర్మ (నెల్లూరు), జి.ప్రాణేష్‌రావు (అనంతపురం), వి.రామకృష్ణ (కృష్ణా), కె.మురళి (ప్రకాశం), కార్యదర్శులుగా కె.అరుణ్‌కుమార్ (శ్రీకాకుళం), జి.మహమ్మద్ అలీ (కర్నూలు), ఎస్.కె.నజీర్ మహమ్మద్ (గుంటూరు), ఎం.సుధాకర్ (చిత్తూరు) ఎన్నికయ్యారు. క్రీడా కార్యదర్శిగా యు.ప్రవీణ్‌కుమార్ (వైఎస్ఆర్), మహిళా ప్రతినిధులుగా వాణిశ్రీ, దీప (గుంటూరు)లను ఎన్నుకున్నారు.

రేషన్ బియ్యం మాయంలో..
సూత్రధారులెవరు..?
ఆద్యంతం అనుమానాలే..


పౌరసరఫరాలశాఖ గోదామును తనిఖీ చేస్తున్న అప్పటి ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర (పాత చిత్రం)

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు పౌరసరఫరాల శాఖ గోదాంలో 223 టన్నుల రేషన్ బియ్యం మాయం కావడంలో సూత్రధారులు ఎవరనేది అధికారుల విచారణలో నిగ్గుతేలాల్సి ఉంది. గోదాం డీటీగా విష్ణు మాత్రమే పాత్రధారుడని అధికారుల తనిఖీల్లో నిగ్గు తేల్చారు. వాస్తవానికి ఇందులో ఎవరెవరు ఉన్నారనే దానిపై లోతుగా విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

దశల వారీగా తరలింపు..

223 టన్నుల బియ్యం ఒక్కరోజులో అక్రమంగా తరలింపు కష్టమే. దశలవారీగా గోదాంకు రాకుండానే వచ్చిన వాహనాలు వచ్చినట్లు అక్రమంగా వ్యాపారులకు తరలించేసినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో నగరి కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా బహిరంగంగానే సాగింది. పుత్తూరు, నగరి, విజయపురం, నిండ్ర, వడమాలపేట మండలాలే కాక సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం, పిచ్చాటూరు మండలాల నుంచి రేషన్ బియ్యం సేకరించి క్రయవిక్రయాలు చేసి రూ. కోట్లు ఆర్జించారు. ఇందులో వారి ప్రమేయంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోదాం డీటీతో మాట్లాడుకుని నేరుగా తరలించినట్లు సమాచారం. ఇందులో గేటుపుత్తూరుకు చెందిన ప్రతిపక్ష పార్టీ పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

వాస్తవాలు దాచి..

వాస్తవానికి ప్రతినెలా గోదాముకు ఎంత స్టాకు వచ్చింది.. ఎంత సరకు దుకాణాలకు వెళ్లింది. ఇంకా ఎంత ఉందనేది ఆ శాఖ ఉన్నతాధికారి కార్యాలయంలో పనిచేసే సిబ్బంది తనిఖీ చేయాలి. అయితే ఆ దిశగా జరగడంలేదు. ప్రతినెలా వచ్చామా.. వాళ్లు ఇచ్చిన మామూళ్లు తీసుకున్నామా.. సంతకాలు చేశామా .. వెళ్లామా అనేది జరుగుతోంది. అదే తనిఖీ అధికారులు నిక్కచ్చిగా ఉంటే ఇలాంటి పరిస్థితి ఉండదు. గతనెల తనిఖీలకు వచ్చిన అధికారులు సైతం రూ.2.05 కోట్ల అవినీతి సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదంతా ఆ శాఖ ఉన్నతాధికారుల కన్నుసన్నల్లోనే జరిగినట్లు తెలుస్తోంది.

వివాదాస్పదంగా విష్ణు వ్యవహారం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నగరికి చెందిన ఓ వ్యక్తి రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. అతడికి ఇటీవల పుత్తూరు గోదాం నుంచి నేరుగా రెండు లారీల బియ్యం వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలోనూ నగరిలో అతడు గోదాం నుంచి రెండు లారీల రేషన్ బియ్యం తీసుకెళ్తున్న సమయంలో విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. అప్పట్లో అక్కడ పనిచేస్తున్న గోదాం డీటీ సైతం సస్పెండ్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆ కోణంలోనూ విచారణ చేస్తే మరిన్ని విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. సస్పెండ్ అయిన విష్ణుది నెల్లూరు జిల్లా కావడంతో సూళ్లూరుపేట కేంద్రంగా జరిగిన రేషన్ బియ్యం అక్రమాలు కోకొల్లలు. ఈ నేపథ్యంలో అక్కడి వారి పాత్ర పైనా అనుమానాలు ఉన్నాయి. అతడు గతంలో నెల్లూరు జిల్లాలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. నెల్లూరులో విధుల్లో అలసత్వంగా వ్యవహరించేవారిన శాఖ సిబ్బంది చెబుతున్నారు. జూన్ 28న జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా ఉన్న ధ్యానచంద్ర పుత్తూరు గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలు తనిఖీ చేసి ఉంటే అప్పట్లోనే ఈ అవినీతి వెలుగుచూసేది.

తీగలాగితే కదలనున్న డొంక..

సస్పెండైన డీటీ విష్ణు కొద్దిరోజులుగా పరారీలో ఉన్నాడు. అతడిని పట్టుకుని ఎవరెవరికి రేషన్ బియ్యం విక్రయించారని కూపీ లాగితే ఈ వ్యవహారంలో ఉన్న పెద్దతలలూ బయటకు వచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా పోలీసులు దృష్టి సారించాలి. మరో వైపున జిల్లా ఉన్నతాధికారులు ఈ అవినీతిలో ఉన్న సూత్రధారులు, పాత్రధారులెవరనేది నిగ్గు తేల్చాల్సి ఉంది.

రేపు చిత్తూరులో పోలీసు గ్రీవెన్స్

చిత్తూరు(నేరవార్తలు): జిల్లా ఏఆర్(పాత డీపీవో) కార్యాలయంలో సోమవారం జరగనున్న పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమాన్ని కొన్ని అనివార్య కారణాలతో మంగళవారానికి మార్పు చేశామని పోలీసు అధికారులు తెలిపారు. ఉదయం 10.30 నుంచి ఎస్పీ మణికంఠ, ఇతర అధికారులు స్వీకరించి పరిష్కరిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




నూతన అధ్యక్షుడిగా సంతకం చేస్తున్న లక్ష్మీపతిరాజు

మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడిగా లక్ష్మీపతిరాజు

పుత్తూరు, న్యూస్‌టుడే: కేబీఆర్‌పురం పంచాయతీలోని రాజుల కండ్రిగకు చెందిన జి.లక్ష్మీపతిరాజును విశాఖపట్నంలోని మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖపట్నంలో ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం 2024-29 వరకు కొనసాగుతుందని ఎన్నికల అధికారి పెడిరెడ్ల రాజశేఖర్, పరిశీలకులు వికాస్ ఖరార్ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా సైకం రాంప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పీవీ కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా జగదీష్, నాగేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, హరిగోపాల్, నాగసుందరం, రమేష్‌కుమార్, ఈసీ సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఆరోగ్యమే మహాభాగ్యం నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. అసోసియేషన్‌కు ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

నగరి, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో 21న జరిగే ఆశా కార్యకర్తల సభను విజయవంతం చేయాలని చిత్తూరు జిల్లా ఆశా కార్యకర్తల సంఘం ప్రధాన కార్యదర్శి చందామరై పిలుపునిచ్చారు. నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు ఆదివారం విజయవాడ బయల్దేరి వెళ్లామని చెప్పారు. ఏఐటీయూసీ పిలుపు మేరకు ఈ సభ జరగనుందని, కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు.



గుడిపాల: గుర్రాళ్లమిట్టలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జగన్మోహన్ ◆ పెనుమూరు: అడ్డారెడ్డిపల్లెలో సీసీరోడ్డు శంకుస్థాపనలో ఎమ్మెల్యే థామస్

గ్రామాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

గుడిపాల, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. 197.రామాపురం శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. నంగ మంగళం నుంచి వేలురాం బట్టికి, చిత్తూరు-వేలూరు జాతీయ రహదారి నుంచి అనుపు గ్రామాలకు బీటీరోడ్లకు, కిలారిపల్లె, గుర్రాళ్లమిట్ట, కిలారిపల్లెలో సీసీరోడ్ల నిర్మాణాలకు లాంఛనంగా శంకుస్థాపన చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ, ఎంపీడీవో శివరాజు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, తెదేపా మండల కన్వీనర్ సుబ్రహ్మణ్యం, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి, జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శి పీటర్, జడ్పీటీసీ మాజీ సభ్యులు బాలాజీ, సుమతి, ఎంపీటీసీలు హరిప్రసాద్, విజయలక్ష్మి, జనసేన పార్టీ మండల కన్వీనర్ రూప్‌కుమార్ పాల్గొన్నారు. **పెనుమూరు, వెదురుకుప్పం, ఎస్సార్‌పురం:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని ఎమ్మెల్యే థామస్ అన్నారు. ఆయన శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, పెనుమూరు మండలాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ భాజపా, జనసేన బాధ్యులు రాజేంద్రన్, యుగంధర్, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పెనుమూరులో భారీ వర్షం


గొబ్బిళ్లమిట్ట వద్ద నేలకొరిగిన వరి

పెనుమూరు, న్యూస్‌టుడే: పెనుమూరు పరిసర ప్రాంతాల్లో గంటకు పైగా ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. అప్పుడప్పుడు గాలులు వీచడంతో అక్కడక్కడ వరి పంట నేల కొరిగింది. తరచూ వర్షాలతో వివిధ పంటలకు నష్టం వాటిల్లుతోందని, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. జిల్లాలోని ప్రజలు ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంతర్రాష్ట్ర పోటీల్లో రాణించినా కనికరం లేదా?
కౌన్సిలర్ బాలసుబ్రహ్మణ్యం ఆవేదన



◗ శ్వేత ◗ తమిళనాడులో సాధించిన ధ్రువపత్రం

పుత్తూరు, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర కబడ్డీలో రాణించిన విద్యార్థిని శ్వేత విషయంలో స్థానిక విద్యాశాఖ అధికారులు కనికరం చూపకపోవడంతో ఆ విద్యార్థిని రాష్ట్ర జట్టుకు ఎంపిక కాలేదని కౌన్సిలర్ బాలసుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన శ్వేత గేటుపుత్తూరులోని తమిళ పాఠశాలలో పదో తరగతి చదువుతోందని, 2023లో తమిళనాడులో జరిగిన జిల్లాస్థాయి జూనియర్స్ కబడ్డీలో పతకం సాధించిందన్నారు. 19న బైరెడ్డిపల్లెలో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఎంపిక కాకపోవడం బాధాకరమన్నారు. నెలరోజులుగా ఆ విద్యార్థినికి శిక్షణ ఇప్పించాలని, ఖర్చంతా తామే భరిస్తామని తల్లి దండ్రులు కోరినా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారని, ఫలితంగా ఆ విద్యార్థిని ఎంపిక కాలేదని ఇలా చేయడం ఏమాత్రం తగదన్నారు.

ఆవును చంపి మాంసాన్ని తరలిస్తున్న ఇద్దరు నిందితుల అరెస్ట్



ఆటోను స్వాధీనం చేసుకున్న ఎస్సై రాజ్‌కుమార్

కార్వేటినగరం, న్యూస్‌టుడే: స్థానిక అటవీ శాఖ పరిధిలోని అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన ఆవును చంపి మాంసాన్ని తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి ఆటో స్వాధీనం చేసుకున్నామని ఎస్సై రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. వెదురుకుప్పం మండలం గెరిగదొన గ్రామానికి చెందిన హరిబాబు శనివారం మేత కోసం ఆవును అడవిలో విడిచిపెట్టాడు. వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం హరిజనవాడకు చెందిన పోతిగుంట సూర్య, పట్లూరి తరుణ్ ఎగువ గూళూరుకు చెందిన లవకుమార్, హేమాద్రి శనివారం రాత్రి ఆవును వధించి ఆ మాంసాన్ని ఆటోలో తరలిస్తుండగా స్థానికులు గుర్తించి ఇద్దరు నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి ఆటో స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

ఫోర్జరీ కేసులో మరొకరు..

వెదురుకుప్పం, న్యూస్‌టుడే: మహిళా రైతుకు చెందిన భూమిని నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో నిందితుడు పుల్లారెడ్డిని అరెస్టు చేశామని సీఐ హనుమంతప్ప తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంటావారిపల్లెకు చెందిన మహిళా రైతుకు చెందిన భూమిని.. సమీప బంధువులు పుల్లారెడ్డి, జయచంద్రారెడ్డి కలిసి నకిలీపత్రాలు సృష్టించారన్నారు. వాటి ఆధారంగా భూమిని తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఈ విషయమై ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, తహసీల్దారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామన్నారు. వీరిలో జయచంద్రారెడ్డిని గత నెలలో అరెస్టు చేయగా పుల్లారెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఎస్సై వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం


చైతన్యతో ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అండర్-17 బాలుర జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీల్లో తాళంబేడు ఉన్నత పాఠశాలకు చెందిన చైతన్య ప్రథమ స్థానంలో నిలిచాడని ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి తెలిపారు. పూతలపట్టులో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు. ఈ నెల 26 నుంచి 28 వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో చైతన్య పాల్గొంటాడని చెప్పారు. ఈ విద్యార్థిని పీడీ ఉమాపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

పీహెచ్‌డీ ప్రదానం


గాయత్రీదేవి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: గుడిపాల మండలం చిత్తపార జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ కరణం గాయత్రీదేవికి పీహెచ్‌డీ ప్రదానం చేశారు. తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంగ్లిష్ ప్రొఫెసర్ హరిపద్మరాణి పర్యవేక్షణలో 'రీడింగ్ గ్రేడెడ్ మెటీరియల్స్ ఇన్ ఇంగ్లిష్-ఏ కేస్ స్టడీ ఆఫ్ ఛాలెంజస్ ఫేస్డ్ బై గవర్నమెంట్ స్కూల్ చిల్డ్రన్ ఎట్ ది సెకండరీ లెవల్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అంశంపై పరిశోధన చేసినందుకు ఈ డాక్టరేట్ లభించిందన్నారు. ఆమెను విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయుడు శరవణ, సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేసిన అధికారి


బాలికల గదిలో ఫ్యాన్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

గుడిపాల: స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహంలో విద్యార్థులు నిద్రించే గదిలో అధికారులు ఆదివారం ఫ్యాను ఏర్పాటు చేశారు. దీనిపై ఆదివారం 'ఈనాడు'లో.. 'పోయేది విద్యార్థులేగా..' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా సహాయ సాంఘిక సంక్షేమాధికారి నాగేశ్వరరావు స్పందించారు. ఆయన వసతిగృహాన్ని పరిశీలించారు. వెంటనే కొత్త ఫ్యాన్ తెప్పించి బిగించారు. వసతిగృహంలో విద్యార్థుల భోజన వసతి, వాటర్ ట్యాంక్, ఆర్వో ప్లాంట్, మరుగుదొడ్ల తలుపులకు మరమ్మతులు చేయించాలని, కోతులు విద్యార్థుల గదుల్లోకి ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అక్కడి హెచ్‌డబ్ల్యూవో సులోచనను ఆదేశించారు.

ఈనాడు కథనానికి స్పందన

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: గోపిశెట్టిపల్లి సమీప విద్యుత్తు నియంత్రిక వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని ఆదివారం గుర్తించామని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. మృతుడు నీలం రంగు గళ్ల లుంగీ, పాచి రంగు బనియన్, ఎరుపు, తెలుపు రంగు టవల్ ధరించాడన్నారు. ఘటన ఐదు రోజుల క్రితం జరిగి ఉండవచ్చన్నారు. గుర్తుతెలియని వ్యక్తి విద్యుత్తు నియంత్రిక వద్ద ఎంబీ స్విచ్‌ను వేయడానికి వెళ్లి విద్యుత్తు ప్రమాదానికి గురైనట్లుగా భావిస్తున్నామన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

'మహిళలకు రక్షణ కల్పించండి'

నగరి: రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ కరవైందని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు అరికట్టాలని మాజీ మంత్రి, వైకాపా అధికార ప్రతినిధి ఆర్.కె.రోజా డిమాండ్ చేశారు. నగరిలో ఆమె మాట్లాడుతూ బద్వేల్‌లో బాలికపై జరిగిన అమానుషమన్నారు. ఈ ఘటనలో దోషులకు బాధిత కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఉరి శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందించి వారికి అండగా నిలవాలని, నిర్లక్ష్యం చేస్తే బహిరంగంగా రోడ్డుపైకి వచ్చి ప్రభుత్వ తీరు ఎండగడతామని పేర్కొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	129
రిటైల్	151
లేయర్	115
బ్రాయిలర్స్	219
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	249
లేయర్ మాంసం	195

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: గిరింపేట రాగిమాను వీధిలో డ్రైనేజీ కాలువ నుంచి దోమల బెడద ఎక్కువగా ఉంది. -స్థానికులు

సమాధానం: డ్రైనేజీ కాలువలో దోమల నివారణకు మలాథియాన్ పిచికారీ చేస్తాం.

-అనిల్ కుమార్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

న్యూస్‌టుడే, పూతలపట్టు

సమస్య: చెర్లోపల్లె బీసీ కాలనీలో వీధి పక్కన తాగునీటి బోరుకు అమర్చిన విద్యుత్తు సర్వీస్ వైర్లు నేలపై ఉన్నాయి. వర్షాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. - స్థానికులు

సమాధానం: వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి తెలియజేశాం.

- చంద్ర, విద్యుత్ లైన్‌మ్యాన్

న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు

సమస్య: జీడీనెల్లూరు-తూగుండ్రం రహదారిలో ముక్కలతూర్పు మలుపు వరకు రెండు విద్యుత్తు స్తంభాలకు పిచ్చి మొక్కలు, తీగలు అల్లుకున్నాయి. -సులోచన, స్థానికురాలు

సమాధానం: స్తంభాలకు అల్లుకున్న తీగలు తొలగింపజేసి ప్రమాదాలు జరగకుండా చూస్తాం.

- హరి, ట్రాన్స్‌కో పర్యవేక్షకులు, జీడీనెల్లూరు

విగ్రహ ప్రతిష్ఠ

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: నగరంలోని గుర్రప్పనాయుడువీధిలో వెలసిన అంకాళ పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఉత్సవర్లను ఆదివారం పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: స్థానిక గిరింపేటలోని సత్యసాయి మందిరంలో సంకటహర చతుర్థి పూజల్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నేడు మండల సమావేశం

పూతలపట్టు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కుమారి అధ్యక్షతన నిర్వహించనున్నామని ఎంపీడీవో నాగరాజు తెలిపారు.

స్పందించారు.. పరిష్కరించారు

నగరపాలక సంస్థ చొరవ



జయచంద్ర కాలనీలోని డ్రైనేజీ కాలువలో పూడిక తీస్తున్న కార్మికుడు ◆ ఓటిచెరువులో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

చిత్తూరు నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కోకొల్లలు.. డ్రైనేజీ కాలువల నుంచి వీధి దీపాలు, పేరుకుపోయిన వ్యర్థాలు తదితర సమస్యలతో ప్రజలు తరచూ సతమతమవుతున్నారు.. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'మేమున్నాం-మీకు తోడుగా' విభాగం తనవంతు సహకారాన్ని అందించింది. ఆయా ప్రాంతాల్లో స్థానిక సమస్యల్ని ప్రజలు స్థానిక 'ఈనాడు' దృష్టికి తీసుకువచ్చారు.. ఆయా సమస్యల్ని ప్రచురించి నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా సంబంధిత సమస్యల పరిష్కారానికి భాగస్వామ్యాన్ని అందించింది.

◆ స్థానిక దొడ్డిపల్లి జయచంద్ర కాలనీలో డ్రైనేజీ కాలువలో చెత్త, వ్యర్థాలు పూడిపోయాయి. ఈ సమస్యపై స్థానికుల ఫిర్యాదు మేరకు 'ఈనాడు'లో ఇటీవల వార్త ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు కాలువలో పూడిక తొలగింపజేసి ఆయా పనులు పూర్తిచేశారు.

◆ స్థానిక ఓటిచెరువులో ఎక్స్‌టెన్షన్‌లో నివాసాల మధ్య మురుగు నీరు, వ్యర్థాలతో నిండిపోవడంపై స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై 'ఈనాడు'లో వార్త ప్రచురితమవగా.. నగరపాలక అధికారులు స్పందించారు. మురుగునీరు సక్రమంగా వెళ్లడానికి ఏర్పాట్లు చేశారు. వ్యర్థాలను వెంటనే తొలగించారు.

◆ స్థానిక కొంగారెడ్డిపల్లి ఆఫీసర్స్ లేన్‌లోని డ్రైనేజీ కాలువలో చెత్త, వ్యర్థాలతో పూడుకుపోయాయి. ఫలితంగా మురుగునీరు రోడ్డుపైకి చేరింది. దీనిపై స్థానికుల ఫిర్యాదుతో 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు నగరపాలక అధికారులు స్పందించి కాలువలో పూడిక తీత పనులు పూర్తిచేశారు.

◆ స్థానిక దుర్గానగర్ కాలనీలో నీటి సమస్యపై స్థానికుల ఫిర్యాదుతో వార్త ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక ఇంజినీరింగ్ విభాగం అధికారులు నీటి సరఫరా మెరుగుపరిచారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశారు.

◆ స్థానిక బాలాజీ కాలనీలో వీధిదీపం మరమ్మతుకు గురవడంపై స్థానికుల ఫిర్యాదుతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు వెంటనే మరమ్మతులు పూర్తిచేశారు.



ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో..

కేబీఆర్‌పురం గ్రామంలో బస్టాప్‌కు వెళ్లేదారి అధ్వానంగా ఉంది. దీంతో గ్రామస్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గత మూడ్రోజులుగా కురిసిన వర్షాలకు గోతుల్లో నీళ్లు నిలవడంతో రాత్రి సమయాల్లో రాకపోకలు ఇబ్బందిగా మారాయి. ప్రజలు, వాహనదారుల బాధలు వర్ణనాతీతం. ఈ నేపథ్యంలో రోడ్డు బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, పుత్తూరు

ఓసారిటు చూడరూ..!



పట్టణంలో స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ద్వారా గతంలో తెదేపా హయాంలో చెత్తకుండీలు ఏర్పాటు చేశారు. ఇంటింటికీ చెత్త సేకరించి దాన్ని వాహనాల్లో డంపింగ్‌యార్డులకు తరలించేవారు. కాలక్రమంలో ఈ కుండీలు దుస్థితికి చేరాయి. అందులో వేసిన చెత్త అంతా కింద పడిపోతోంది. ఈ నేపథ్యంలో వాటికి మరమ్మతులు చేయించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దుర్వాసన వెదజల్లుతోంది. దుస్థితికి చేరిన చెత్త కుండీల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పుత్తూరు



అన్నదాన పథకానికి విరాళం అందిస్తున్న ప్రవీణ్ కేశాని కుటుంబ సభ్యులు ◆ విరాళం అందిస్తున్న కేవీ రమణయ్య

నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు దాతలు తమవంతుగా విరాళాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్ కేశాని రూ.లక్ష, అదే ప్రాంతానికి చెందిన కేవీ రమణయ్య రూ.లక్ష వేర్వేరుగా ఆలయ ఇన్‌స్పెక్టర్ విగ్నేష్, పీఆర్‌వో చిట్టిబాబుకు ఆదివారం అందజేశారు. ఆలయ మర్యాదల ప్రకారం దాతలు, కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించారు. ఆపై సంప్రదాయం ప్రకారం దాతలకు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి



మాట్లాడుతున్న సీతమ్స్ కళాశాల ఛైర్మన్ రంగనాథం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజానికి మంచి పౌరులుగా ఎదగాలని, సమాజంలో సౌఖ్యం, శాంతిని ప్రోత్సహించడానికి తమవంతుగా సహాయపడాలని సీతమ్స్ కళాశాల ఛైర్మన్ రంగనాథం పిలుపునిచ్చారు. నగరంలోని సీతమ్స్ కళాశాలలో యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్(యూహెచ్‌వీ)- ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూహెచ్‌వీ, ఎఫ్‌డీపీ కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. వీటిని ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సలహాదారు నారాయణ, ప్రిన్సిపల్ వెంకటా చలపతి, అకడమిక్స్ డీన్ శరవణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనసున్న బలవంతుడు.. భీముడు



మాట్లాడుతున్న దండాల రాధాకృష్ణారెడ్డి

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: మహాభారతంలో పాండవుల్లో ఒకరైన భీముడు.. మంచి మనసున్న సద్గుణ సంపన్నుడని విశ్రాంత ఆచార్యులు దండాల రాధాకృష్ణారెడ్డి అన్నారు. చైతన్య సాహితీ సంస్థ, హరివిల్లు ఆధ్వర్యంలో 'ఆంధ్ర మహాభారతంలో భీముడు' అంశంపై చెన్నా నాగమ్మ, చెన్నా మునస్వామిరెడ్డి, రాగూరు లక్ష్మమ్మ, రాగూరు రంగారెడ్డి స్మారకోపన్యాస కార్యక్రమం ఆదివారం చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో నిర్వహించారు. ఉపన్యాసకులు మాట్లాడుతూ 'భీముడు అంటే భయంకరుడని అర్థం. కానీ మహాభారతాన్ని పరిశీలిస్తే భీముడు శుభంకరుడని అభివర్ణించారు. భీముడికి భుజబలంపై నమ్మకం ఎక్కువ. దుర్యోధనుడు ఎన్నోసార్లు అతడికి హాని తలపెట్టినా భయపడక రెట్టించిన బలంతో పోరాటం చేశాడు. సోదరుడి మాటన ఎన్నటికీ జవదాటలేదు. తల్లిదండ్రులకు సేవ చేశాడని' వివరించారు. చైతన్య సాహితీ సంస్థ అధ్యక్షుడు రాగూరు నాగిరెడ్డి, హరినాయుడు, రాజరత్నం, జయరామరెడ్డి, భాస్కరరెడ్డి, మునస్వామి పాల్గొన్నారు.

అలా వదిలేశారు..!



ఈ చిత్రంలో ఉబికి వస్తున్న నీరు ఏదో పాతాళ గంగ ఎగిసి పడుతోంది అనుకుంటే పొరబాటే. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన కుళాయి పైపు పగిలి నీరు అలా ఉప్పొంగుతోంది. కావూరివారిపల్లె పంచాయతీ రాణావేణుగోపాలపురం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి ట్యాంకు ద్వారా నీటిని అందిస్తున్నారు. కుళాయి పైపు పగిలి నీరు తరచూ ఇలా నీరు వృథాగా పోతోంది. ఈ విషయమై పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి హేమలతను వివరణ కోరగా కుళాయి పరిశీలించి మరమ్మతు చేయిస్తామని, భవిష్యత్తులో నీరు లీకేజీ కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

-న్యూస్‌టుడే, పెనుమూరు

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: తిరుపతి కళా సంస్కృతి ఆధ్వర్యంలో బంగారుపాళ్యంలో ఆదివారం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తమ కళాజాతా ద్వారా తెలియజేశారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తోందని బృంద ప్రతినిధులు వివరించారు. వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో కళాకారుల(రెడ్డెప్ప) బృందాన్ని స్థానిక గ్రేడ్స్ సంస్థ అధ్యక్షులు శేషాద్రి శాలువాలు కప్పి సత్కరించారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర గణపతి వ్రతం



వ్రతంలో పాల్గొన్న భక్తులు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా ఆదివారం ఉదయం, సాయంత్రం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సామూహిక సంకటహర గణపతి వ్రతంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సిద్ధిబుద్ధి సమేతుడైన వరసిద్ధి వినాయకస్వామి వారి ఉత్సవమూర్తులను పుష్పాలంకరణ చేసి అర్చకులు, వేద పండితులు వ్రతాన్ని నిర్వహించారు. ఈవో వి.గురుప్రసాద్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గుంటూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రశాంతంగా జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా జి.మోహన్‌గోపాలకృష్ణ (రాష్ట్ర సచివాలయం), ప్రధాన కార్యదర్శిగా బి.సి.శంకర్‌నాయక్ (కర్నూలు) కోశాధికారిగా బి.సురేష్‌బాబు (ప్రకాశం), సహాధ్యక్షులుగా ఏసుబాబు (కృష్ణా), ఉపాధ్యక్షులుగా బి.వెన్నారావు (పశ్చిమ గోదావరి), వి.బ్రహ్మానందరెడ్డి (కర్నూలు), వి.చంద్రశేఖర్ (గుంటూరు), మహమ్మద్ జాకిర్ (అనంతపురం), కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్ఎస్‌కే శర్మ (నెల్లూరు), జి.ప్రాణేష్‌రావు (అనంతపురం), వి.రామకృష్ణ (కృష్ణా), కె.మురళి (ప్రకాశం), కార్యదర్శులుగా కె.అరుణ్‌కుమార్ (శ్రీకాకుళం), జి.మహమ్మద్ అలీ (కర్నూలు), ఎస్.కె.నజీర్ మహమ్మద్ (గుంటూరు), ఎం.సుధాకర్ (చిత్తూరు) ఎన్నికయ్యారు. క్రీడా కార్యదర్శిగా యు.ప్రవీణ్‌కుమార్ (వైఎస్ఆర్), మహిళా ప్రతినిధులుగా వాణిశ్రీ, దీప (గుంటూరు)లను ఎన్నుకున్నారు.

రేషన్ బియ్యం మాయంలో.. సూత్రధారులెవరు..?

ఆద్యంతం అనుమానాలే..

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు పౌరసరఫరాల శాఖ గోదాంలో 223 టన్నుల రేషన్ బియ్యం మాయం కావడంలో సూత్రధారులు ఎవరనేది అధికారుల విచారణలో నిగ్గుతేలాల్సి ఉంది. గోదాం డీటీగా విష్ణు మాత్రమే పాత్రధారుడని అధికారుల తనిఖీల్లో నిగ్గు తేల్చారు. వాస్తవానికి ఇందులో ఎవరెవరు ఉన్నారనేది దానిపై లోతుగా విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

దశల వారీగా తరలింపు..

223 టన్నుల బియ్యం ఒక్కరోజులో అక్రమంగా తరలింపు కష్టమే. దశలవారీగా గోదాంకు రాకుండానే వచ్చిన వాహనాలు వచ్చినట్లు అక్రమంగా వ్యాపారులకు తరలించేసినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో నగరి కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా బహిరంగంగానే సాగింది. పుత్తూరు, నగరి, విజయపురం, నిండ్ర, వడమాలపేట మండలాలే కాక సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం, పిచ్చాటూరు మండలాల నుంచి రేషన్ బియ్యం సేకరించి క్రయవిక్రయాలు చేసి రూ.కోట్లు ఆర్జించారు. ఇందులో వారి ప్రమేయంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోదాం డీటీతో మాట్లాడుకుని నేరుగా తరలించినట్లు సమాచారం. ఇందులో గేటుపుత్తూరుకు చెందిన ప్రతిపక్ష పార్టీ పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

వాస్తవాలు దాచి..

వాస్తవానికి ప్రతినెలా గోదాముకు ఎంత స్టాకు వచ్చింది.. ఎంత సరకు

వివాదాస్పదంగా విష్ణు వ్యవహారం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నగరికి చెందిన ఓ వ్యక్తి రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. అతడికి జనసేన పుత్తూరు గోదాం నుంచి నేరుగా రెండు లారీల బియ్యం వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలోనూ నగరిలో అతడు గోదాం నుంచి రెండు లారీల రేషన్ బియ్యం తీసుకెళ్తున్న సమయంలో విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. అప్పట్లో ఆయన పనిచేస్తున్న గోదాం డీటీ సైతం సస్పెండ్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆ కోణంలోనూ విచారణ చేస్తే మరిన్ని విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. సస్పెండ్ అయిన విష్ణు నెల్లూరు జిల్లా కావలితో సూళ్లూరుపేట కేంద్రాలుగా జరిగిన రేషన్ బియ్యం అక్రమాలు కోకొల్లలు. ఈ నేపథ్యంలో అక్కడి వారి పాత్రపైనా అనుమానాలు ఉన్నాయి. అతడు గతంలో నెల్లూరు జిల్లాలో పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. నెల్లూరులో విధుల్లో అలసత్వంగా వ్యవహరించేవారని శాఖ సిబ్బంది చెబుతున్నారు. జూన్ 28న జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా ఉన్న ధ్యాన చంద్ర పుత్తూరు గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలు తనిఖీ చేసి ఉంటే అప్పట్లోనే ఈ అవినీతి వెలుగుచూసేది.



పౌరసరఫరాలశాఖ గోదామును తనిఖీ చేస్తున్న అప్పటి ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర (పాత చిత్రం)

దుకాణాలకు వెళ్లింది. ఇంకా ఎంత ఉందనేది ఆ శాఖ ఉన్నతాధికారి కార్యాలయంలో పనిచేసే సిబ్బంది తనిఖీ చేయాలి. అయితే ఆ దిశగా జరగడంలేదు. ప్రతినెలా వచ్చామా.. వాళ్లు ఇచ్చిన మామూళ్లు తీసుకున్నామా.. సంతకాలు చేశామా .. వెళ్లామా అనే జరుగుతోంది. అదే తనిఖీ అధికారులు నిక్కచ్చిగా ఉంటే ఇలాంటి పరిస్థితి ఉండదు. గతనెలే ఇక్కడకు బదిలీపై వచ్చిన అధికారులు సైతం రూ.2.05 కోట్ల అవినీతి సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదంతా ఆ శాఖ ఉన్నతాధికారుల కన్నుసన్నల్లోనే జరిగినట్లు తెలుస్తోంది.

తీగలాగితే కదలనున్న డొంక..

సస్పెండైన డీటీ విష్ణు కొద్దిరోజులుగా పరారీలో ఉన్నారు. అతడిని పట్టుకుని ఎవరెవరికి రేషన్ బియ్యం విక్రయించారనే కూపీ లాగితే ఈ వ్యవహారంలో ఉన్న పెద్దతలలూ బయటకు వచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా పోలీసులు దృష్టి సారించాలి. మరోవైపున జిల్లా ఉన్నతాధికారులు ఈ అవినీతిలో ఉన్న సూత్రధారులు, పాత్రధారులెవరనేది నిగ్గు తేల్చాల్సి ఉంది.

టెట్‌కు 414 మంది హాజరు

చిత్తూరు విద్య: టెట్‌కు మూడు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించగా 414 మంది హాజరయ్యారు. 53 మంది గైర్హాజరయ్యారు. చిత్తూరు ఎస్వీసెట్ కళాశాలలో 200 మందికి 173 మంది, పి.కొత్తకోట వేము ఇంజినీరింగ్ కళాశాలలో 260 మందికి 235 మంది, చెన్నై ప్రత్య టెక్నాలజీలో ఉదయం పరీక్ష నిర్వహించగా ఏడుగురికి.. ఆరుగురు అభ్యర్థులు పరీక్ష రాశారు.



ఆలయం ఎదుట శ్రీనువైట్ల, విశ్వప్రసాద్, శ్రీకాంత్ తదితరులు

తిరుమలలో విశ్వం చిత్ర బృందం

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఉదయం విశ్వం చిత్ర దర్శకుడు శ్రీనువైట్ల, సినీ నిర్మాత టీజీ విశ్వప్రసాద్, నటుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఆలయం వెలుపల శ్రీనువైట్ల మాట్లాడుతూ.. విశ్వం చిత్రం విజయవంతం కావడంతో శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చామన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ.. రామ్‌చరణ్‌తో గేమ్ ఛేంజర్, సాయిధర్మ తేజ్‌తో ఓ చిత్రం చేస్తున్నానని, తానే హీరోగా మరో చిత్రం చేస్తున్నట్లు తెలిపారు. తన కుమారుడు రోషన్ అశ్వనీదత్ సమర్పణలో 'చాంపియన్' అనే చిత్రం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

రేణిగుంటలో అంతర్జాతీయ క్రీడా ప్రాంగణం



జ్యోతి వెలిగిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రేణిగుంటలో అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రాంగణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం రాష్ట్రస్థాయి జూడో క్రీడాకారుల ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ స్థాయిలో అన్నిరకాల క్రీడల నిర్వహణకు వీలుగా అభివృద్ధి చేయనున్నట్లు సంకల్పించామన్నారు. జాతీయ స్థాయి జూడో క్రీడాకారిణి ఝాన్సీకి, ఆమెకు శిక్షణ ఇచ్చిన శిక్షకులు గోపికి రూ.10 వేలు వంతున ప్రోత్సాహకాలను అందజేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, భాజపా రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తిరుపతి(క్రీడలు): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నెలకొన్న క్రీడా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని శాప్ ఛైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని శాప్ కార్యాలయంలో ఆదివారం భారత హాకీ క్రీడాకారిణి రజని.. శాప్ ఛైర్మన్ రవినాయుడిని మర్యాదపూర్వంగా కలిసి క్రీడా రంగంలోని సమస్యలపై చర్చించారు. పలు సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. సానూకులంగా స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

అచ్చం పక్షుల్లా..!

పుంగనూరు పరిసర ప్రాంతాల్లో వరిపంటలో పక్షులు వెన్ను తిని పాడు చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొంగలు, పక్షుల బారిన పడకుండా పంటను కాపాడుకునేందుకు రైతులు వివిధ రకాల పద్ధతులు అవలంబిస్తున్నారు. అందులో భాగంగానే ఓ రైతు తన పొలంలో మెరుగు కాగితాలను వేలాడదీశారు దీంతో అటు వైపు పక్షులు రావడం లేదని చెబుతున్నారు.

\- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ





నూతన అధ్యక్షుడిగా సంతకం చేస్తున్న లక్ష్మీపతిరాజు

మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడిగా..

పుత్తూరు, న్యూస్‌టుడే: కేబీఆర్‌పురం పంచాయతీలోని రాజుల కండ్రిగకు చెందిన జి.లక్ష్మీపతిరాజును విశాఖపట్నంలోని మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖపట్నంలో ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం 2024-29 వరకు కొనసాగుతుందని ఎన్నికల అధికారి పెడిరెడ్ల రాజశేఖర్, పరిశీలకులు వికాస్ ఖరార్ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా సైకం రాంప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పీవీ కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా జగదీష్, నాగేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, హరిగోపాల్, నాగసుందరం, రమేష్‌కుమార్, ఈసీ సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఆరోగ్యమే మహాభాగ్యం నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. అసోసియేషన్‌కు ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

అంతర్రాష్ట్ర పోటీల్లో రాణించినా కనికరం లేదా?

కౌన్సిలర్ బాలసుబ్రహ్మణ్యం ఆవేదన





శ్వేత తమిళనాడులో సాధించిన ధ్రువపత్రం

పుత్తూరు, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర కబడ్డీలో రాణించిన విద్యార్థిని శ్వేత విషయంలో స్థానిక విద్యాశాఖ అధికారులు కనికరం చూపక పోవడంతో ఆ విద్యార్థిని రాష్ట్ర జట్టుకు ఎంపిక కాలేదని కౌన్సిలర్ బాలసుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన శ్వేత గేటుపుత్తూరులోని తమిళ పాఠశాలలో పదో తరగతి చదువుతోందని, 2023లో తమిళనాడులో జరిగిన జిల్లాస్థాయి జూనియర్స్ కబడ్డీలో పతకం సాధించిందన్నారు. 19న బైరెడ్డిపల్లెలో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఎంపిక కాకపోవడం బాధాకరమన్నారు. నెలరోజులుగా ఆ విద్యార్థినికి శిక్షణ ఇప్పించాలని, ఖర్చంతా తామే భరిస్తామని తల్లిదండ్రులు కోరినా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారని, ఫలితంగా ఆ విద్యార్థిని ఎంపిక కాలేదని ఇలా చేయడం ఏమాత్రం తగదన్నారు.

హత్యాయత్నం.. దౌర్జన్యం కేసుల్లో

వైకాపా కార్యకర్తల అరెస్టు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పుంగనూరులో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వైకాపా కార్యకర్తలు నలుగురిని పుంగనూరు పోలీసులు శనివారం అరెస్టు చేసి మదనపల్లె ఉపకారాగారానికి తరలించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం సీఐ మాట్లాడుతూ.. ఈ ఏడాది జులై 17న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి.. పుంగనూరులోని మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న నేతిగుట్లపల్లె ప్రాజెక్ట్ నిర్వాసితులు, తెదేపా కార్యకర్తలు పరిహారం అడిగేందుకు మాజీ ఎంపీ ఇంటికి ర్యాలీగా వెళ్లారు. వారిపై వైకాపా కార్యకర్తలు రాళ్లు, కర్రలతో దాడిచేశారు. ఈ ఘర్షణలో పలువురు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు వైకాపా కార్యకర్తలైన షేక్ ఇర్ఫాన్ బాషా, మహబూబ్ బాషా (అమ్మకుట్టి), నిజాముద్దీన్, సయ్యద్ అయాజ్‌లపై కేసులు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితులు పట్టణంలోకి వచ్చినట్లు సమాచారం అందడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నిందితులకు 15 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ వెల్లడించారు.

ఫోర్జరీ కేసులో మరొకరు..

వెదురుకుప్పం, న్యూస్‌టుడే: మహిళా రైతుకు చెందిన భూమిని నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో నిందితుడు పుల్లారెడ్డిని అరెస్టు చేశామని సీఐ హనుమంతప్ప తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంటావారిపల్లెకు చెందిన మహిళా రైతుకు చెందిన భూమిని.. సమీప బంధువులు పుల్లారెడ్డి, జయచంద్రారెడ్డి కలిసి నకిలీపత్రాలు సృష్టించారన్నారు. వాటి ఆధారంగా భూమిని తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఈ విషయమై ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, తహసీల్దారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామన్నారు. వీరిలో జయచంద్రారెడ్డిని గత నెలలో అరెస్టు చేయగా పుల్లారెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఎస్సై వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం



చైతన్యతో ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అండర్-17 బాలుర జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీల్లో తాళంబేడు ఉన్నత పాఠశాలకు చెందిన చైతన్య ప్రథమ స్థానంలో నిలిచాడని ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి తెలిపారు. పూతలపట్టులో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు. ఈ నెల 26 నుంచి 28 వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో చైతన్య పాల్గొంటాడని చెప్పారు. ఈ విద్యార్థిని పీడీ ఉమాపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేసిన అధికారి



బాలికల గదిలో ఫ్యాన్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

గుడిపాల: స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహంలో విద్యార్థులు నిద్రించే గదిలో అధికారులు ఆదివారం ఫ్యాను ఏర్పాటు చేశారు. దీనిపై ఆదివారం 'ఈనాడు'లో.. 'పోయేది విద్యార్థులేగా..' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా సహాయ సాంఘిక సంక్షేమాధికారి నాగేశ్వరరావు స్పందించారు. ఆయన వసతిగృహాన్ని పరిశీలించారు. వెంటనే కొత్త ఫ్యాన్ తెప్పించి బిగించారు. వసతిగృహంలో విద్యార్థుల భోజన వసతి, వాటర్ ట్యాంక్, ఆర్వో ప్లాంట్, మరుగుదొడ్ల తలుపులకు మరమ్మతులు చేయించాలని, కోతులు విద్యార్థుల గదుల్లోకి ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అక్కడి హెచ్‌డబ్ల్యూవో సులోచనను ఆదేశించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: గోపిశెట్టిపల్లి సమీప విద్యుత్తు నియంత్రిక వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని ఆదివారం గుర్తించామని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. మృతుడు నీలం రంగు గళ్ల లుంగీ, పాచి రంగు బనియన్, ఎరుపు, తెలుపు రంగు టవల్ ధరించాడన్నారు. ఘటన ఐదు రోజుల క్రితం జరిగి ఉండవచ్చన్నారు. గుర్తుతెలియని వ్యక్తి విద్యుత్తు నియంత్రిక వద్ద ఎంబీ స్విచ్‌ను వేయడానికి వెళ్లి విద్యుత్తు ప్రమాదానికి గురైనట్లుగా భావిస్తున్నామన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఏనుగుల దాడిలో వరి పంట ధ్వంసం



కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాతపేట, బోడ్రెడ్డి గారిపల్లె పంచాయతీల్లో 14 ఏనుగుల గుంపు వరి పంటపై బీభత్సం చేశాయి. పూరేడువారిపల్లెకు చెందిన రైతులు ఆర్ సిద్ధయ్య, వాసు మూడు ఎకరాలు, శేఖర్ అర ఎకరా వరి పంటను ధ్వంసం చేశాయి. ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లెకు చెందిన రమణయ్య, తిరుమలయ్య, కౌలు రైతు రామయ్య రెండు ఎకరాల వరి పంటను తొక్కి నాశనం చేశాయి. కల్లూరుకు చెందిన రైతు శ్రీనివాసులు మామిడి తోట ప్రధాన గేటును విరిచి రెండు కొబ్బరి చెట్లను కూల్చి, వరి పంటను ధ్వంసం చేశాయి.

రేపు చిత్తూరులో పోలీసు గ్రీవెన్స్

చిత్తూరు(నేరవార్తలు): జిల్లా ఏఆర్(పాత డీపీవో) కార్యాలయంలో సోమవారం జరగనున్న పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమాన్ని కొన్ని అనివార్య కారణాలతో మంగళవారానికి మార్పు చేశామని పోలీసు అధికారులు తెలిపారు. ఉదయం 10.30 నుంచి ఎస్పీ మణికంఠ, ఇతర అధికారులు స్వీకరించి పరిష్కరిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	129
రిటైల్	151
లేయర్	115
బ్రాయిలర్స్	219
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	249
లేయర్ మాంసం	195

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

కురబల సంక్షేమానికి తెదేపా కృషి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కురబ కులస్తుల సంక్షేమం, అభ్యున్నతికి తెదేపా కృషి చేస్తోందని కురబ కుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు నాగభూషణం ఆదివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో కురబలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సవితమ్మకు రాష్ట్ర క్యాబినెట్‌లో స్థానం కల్పించి బీసీ, జవులి, చేనేత శాఖలను కేటాయించడం, హిందూపురం, కర్నూలు ఎంపీలుగా బి.కె.పార్థసారథి, పంచలింగాల నాగరాజుకు అవకాశం కల్పించడం సంతోషకరమని చెప్పారు. కార్యక్రమంలో కురబ సంఘం నాయకులు గౌరప్ప, సుబ్రహ్మణ్యం, శివప్ప, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: స్థానిక గిరింపేటలోని సత్యసాయి మందిరంలో సంకటహర చతుర్థి పూజలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

న్యూస్‌టుడే, పలమనేరు

సమస్య: పట్టణంలోని ఎంబీటి రహదారిలో రాచకాలువ పూడిపోతోంది. దాని కారణంగా అప్పుడప్పుడు కాలువ పొడవునా దుర్గంధం వస్తోంది. పూడిక తీయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. – ముకేష్, పలమనేరు

సమాధానం: ఇప్పటికే కొన్ని చోట్ల పూడిక తీసే పనులు చేస్తున్నాం. ఎంబిటి రహదారిలో కూడా పూడిక తీస్తాం. – ఎన్వీరమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, పలమనేరు

న్యూస్‌టుడే, సోమల

సమస్య: నెల్లిమంద పంచాయతీ చింతలవారిపల్లె కొత్తపల్లెలోని మురుగు కాలువలో నీరు నిలిచిపోవడంతో దుర్గంధం వస్తోంది. దోమల బెడద ఎక్కువగా ఉంది. అధికారులు చొరవ తీసుకోవాలి. – లోకేష్‌నాయుడు, గ్రామస్థుడు

సమాధానం: మురుగునీరు నిల్వ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – లక్ష్మీదేవి, ఈవోపీఆర్డీ, సోమల

దీపాలకు మరమ్మతులు

స్పందనకు వందనం

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని షిర్డీసాయినగర్‌లో వీధిదీపాలకు మరమ్మతులు చేశారు. ఈ నెల 20న ఈనాడు దినపత్రికలో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికలో వీధిదీపాలు వెలగడం లేదని వార్త ప్రచురితమైంది. దీంతో పురపాలక కమిషనరు మధుసూదనరెడ్డి ఆదేశాలతో వీధి దీపాలు మరమ్మతుకు నోచుకున్నాయి.

గ్రామాభివృద్ధే లక్ష్యం: చల్లా


సీసీరోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన రహదారుల నిర్మాణానికి పల్లెపండుగ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రూపకల్పన చేశారని పుంగనూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి వెల్లడించారు. ఆదివారం మండలంలోని అయ్యావాండ్లపల్లె పంచాయతీ ఎర్రవాండ్లపల్లెలో రూ.15లక్షలు, పులిచెర్ల రూ.10లక్షలతో నిర్మించిన సీసీరోడ్ల నిర్మాణ పనులు, ఉపాధిహామీ పథకంలో రూ.80లక్షలతో మంజూరైన మినీ గోకులాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి అంటే ఏమిటో గ్రామ స్వరాజ్యం ఏమిటో చూస్తారని గుర్తుచేశారు. పులిచెర్లలో జరిగిన కార్యక్రమంలో రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం ప్రజలు చల్లాబాబుకు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో రామనారాయణ, వెంకటరమణ, కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రమేష్, మహేష్, మురళీధర్‌నాయుడు, అబ్బుల్ నజీర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

చౌడేపల్లె, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే పల్లె పండుగ లక్ష్యమని మండల తెదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆమినిగుంట పంచాయతీ సింగిరిగుంటలో ఆయన వినాయకుని పూజ చేసి సిమెంటు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వెంగళపల్లె, చారాల, పరికిదొన, తెల్లనీళ్లపల్లెల్లో సీసీ రోడ్డు పనులకు భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, ఈవోపీఆర్డీ కృష్ణవేణి, పంచాయతీ స్థానిక నాయకులు ప్రదీప్‌రాజు, వెంకటరమణ, రామచంద్ర, శ్రీనివాసులు, చంద్రమౌళి, బాబునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వసూళ్లు సరే...

ఆదాయం ఉన్నా అభివృద్ధి కరవు

వసతులు ఏవీ?


పుంగనూరులో టార్పాలిన్ పట్టల నీడన నిర్వహిస్తున్న వారపు సంత

పుంగనూరు, పలమనేరు, కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఏటా లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా వారపు సంతల్లో అవసరమైన వసతుల కల్పనపై దృష్టి పెట్టడం లేదు. షెడ్లు ఏర్పాటు చేసి వసతులు కల్పించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పురపాలకల్లోని వారపు సంతల్లో మరీ అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సంతల్లో కూరగాయలు, ఇతర సరుకులు, వస్తువులు విక్రయించుకునే వ్యాపారులు గేటు పేరుతో రూ.లక్షల్లో పురపాలికలకు ఆదాయం చేకూరుతోంది. వసతులు లేక వ్యాపారులు, వినియోగదారులు పడుతున్న బాధలు వర్ణనాతీతం.

● పుంగనూరులో ప్రతి సోమవారం నిర్వహించే వారపు సంత ద్వారా ఏటా రూ.8.52 లక్షల ఆదాయం పురపాలకకు లభిస్తోంది. ఇక్కడ షెడ్లు, ప్లాట్‌ఫారాలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు వంటి వసతులు లేవు. సుమారు 250 మంది వ్యాపారులు ఇక్కడ వ్యాపారాలు చేస్తుంటారు. చుట్టుపక్కల మండలాలకు చెందిన ప్రజలు కూరగాయలు, నిత్యావసర వస్తువులను కొనుగోలు చేస్తారు. విద్యుత్తు వసతులు లేని కారణంగా సాయంత్రం త్వరగా సంతను ముగించాల్సివస్తోంది.

● కుప్పం పురపాలకలో కొత్తపేట జంక్షన్ రోడ్లపై వారపు సంత జరుగుతుంది. సంత ద్వారా గతంలో పురపాలకకు రూ.20 లక్షల ఆదాయం చేకూరేది. కానీ వైకాపా ప్రభుత్వంలో గేటు వసూళ్లు చేయకుండా వదిలేశారు. అప్పటి నుంచి ఇక్కడ వారపు సంత ద్వారా పురపాలకకు ఎలాంటి ఆదాయం చేకూరడం లేదు. వసతుల కల్పనపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ఎండకు, వానకు దుకాణదారులు, వినియోగదారులు ప్లాస్టిక్ కవర్ల కింద తలదాచుకుంటున్నారు. పొరుగు మండలాల నుంచి వేలాది మంది వినియోగదారులు వస్తుండడంతో రోడ్లపై రద్దీ నెలకొంటోంది.

ప్రతిపాదనలు పంపుతాం

పుంగనూరు, పలమనేరు వారపు సంతల్లో మౌలిక వసతుల కల్పనకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. అధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం
– మధుసూదనరెడ్డి(పుంగనూరు), రమణారెడ్డి(పలమనేరు)

అధికారుల దృష్టికి తీసుకెళ్తా

కుప్పం పురపాలక పరిధిలో ఆగిపోయిన వారపు సంత గేటు వసూళ్ల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాసరావు, పురపాలక కమిషనరు, కుప్పం

● పలమనేరు పురపాలక వారపు సంతలో కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేసిన ప్లాట్ ఫారాలే దిక్కు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు కట్టుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే వారపు సంతతో పురపాలకకు రూ.15 లక్షల ఆదాయం వస్తోంది. తాగునీరు, విద్యుత్తు, షెడ్లు, మరుగుదొడ్లు, వంటి వసతులు లేక ప్రజలు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు.


వసతులులేని పలమనేరు వారపు సంత

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పలమనేరు, న్యూస్‌టుడే: పలమనేరు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో మహదేవమంగళం నుంచి పలమనేరు వరకు విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని సబ్‌డివిజన్ అధికారి చిన్నబ్బ తెలిపారు. ఈనెల 21వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరాలో ఉండదని ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పలమనేరు, బైరెడ్డిపల్లె, వి.కోట, శాంతిపురం, కుప్పం మండలాల పరిధిలో అత్యవసర సమయాల్లో మాత్రం విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.


హిటాచీని అడ్డుకున్న ప్రజలు

అక్రమ తవ్వకాలు అడ్డుకున్న రైతులు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: పుంగనూరు-చౌడేపల్లె మండలాల సరిహద్దులోని లద్దిగం చెరువు నుంచి అక్రమార్కులు రాత్రిపగలు తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుక తరలిస్తుండటంతో ఆయకట్టు రైతులు ఆదివారం అడ్డుకున్నారు. 700 ఎకరాల విస్తీర్ణంలో ఉండే చెరువు రూపురేఖలు మార్చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏతూరు, లద్దిగం, పుదిపట్ల, తిరుమణపల్లె, బండ్లపల్లె, అంకుతోటపల్లె పంచాయతీల ప్రజలు ఈ చెరువుపై ఆధారపడ్డారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని కోరుతున్నారు.

అభివృద్ధే కూటమి ధ్యేయం

రామకుప్పం, న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రుడు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మొద్దులవంకలో భాజపా జెండా ఆవిష్కరించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ బాధ్యులు నరేష్, భాజపా నేతలు శివ, పార్థసారధి, ప్రభాకర్, రాజశేఖరులు, గోపినాథ్, హరీశ్ పాల్గొన్నారు.

జనసేన నాయకుల అభినందనలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం జనసేన నాయకులు నూతన ఎస్సై పరశురాముడును కలిసి అభినందనలు తెలిపారు. జనసేన నియోజకవర్గ బాధ్యులు దిలీప్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు చైతన్యకుమార్, నాయకులు దినేష్, నగేష్, దేవ, అమర్, రమేష్, మధు, హరి ఎస్సైని దుశ్శాలువతో సత్కరించారు.

యువత సన్మార్గంలో నడవాలి

పుంగనూరు గ్రామీణ: యువత సన్మార్గంలో నడిచి ఆదర్శవంతమైన సమాజ సేవలో భాగం కావాలని పాస్టర్ రాజేష్ నిర్మల్ తెలిపారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ హెచ్‌ఎం చర్చిలో యువత జనోత్సవం ఘనంగా నిర్వహించారు. యేసుక్రీస్తు వివరించిన సూక్తులు తెలుపుతూ కీర్తనలు ఆలపించి బైబిల్ పఠనం చేశారు. యువత వివిధ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు హేమంత్, బెనెట్, అభిషేక్, బన్ని తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: పూతలపట్టు నుంచి కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బైరెడ్డిపల్లె వద్ద ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై పరశురాముడు తెలిపారు. పూతలపట్టు మండలం రంగంపేటకు చెందిన గోవిందస్వామి కుమారుడు శివానందన్ మినీ వ్యానులో 2,500 కిలోల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. వాహనం సహా రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

భయపెడుతున్న శునకాలు


రామచంద్రారోడ్డులో శునకాల గుంపు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలో శునకాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని గతంలో అధికారులు ప్రకటనలు చేశారు. యజమానులు శునకాలకు సంబంధించి లైసెన్సులు తప్పనిసరిగా తీసుకోవాలంటూ నిబంధనలు విధించారు. పలు వీధుల్లో ఉన్న శునకాలను పట్టుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ చేశారు. అయితే కొన్నాళ్లకు చేతులు దులుపుకోవడంతో శునకాల సంఖ్య అధికమై వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. శునకాల కారణంగా వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో శునకాల దాడిలో కొందరు పిల్లలు గాయపడి ఆస్పత్రి పాలైన ఘటనలు ఉన్నాయి. అధికారులు శునకాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రొటోకాల్ వివాదంపై దుమారం

కుప్పం గ్రామీణ: కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆహ్వాన పత్రికలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేరు ముద్రించలేదని ఆ పార్టీ నాయకులు సామాజిక మాధ్యమాల్లో విమర్శలు గుప్పించారు. దీనిపై రిజిస్ట్రార్ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా శిలాఫలకాలకు మాత్రమే ప్రొటోకాల్ వర్తిస్తుందని, ఆహ్వాన పత్రికలో కార్యక్రమానికి హాజరయ్యే వారి పేర్లను మాత్రమే ముద్రించనున్నట్లు తెలిపారు.

వీరిని అడ్డుకునేవారేరి

● ఆగని ఇసుక తరలింపు
● ఇప్పటికే భూగర్భజలాలు.. మాయం

పలమనేరు, న్యూస్‌టుడే: ఇసుకాసురుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. వీరిని అడ్డుకునేవారే లేకుండా పోతోంది. ఎక్కడ పడితే అక్కడ ఇసుక తీస్తూ రెచ్చిపోతున్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో గ్రామస్థులు, రైతులు ఇసుక తవ్వకాలను అడ్డుకున్నారు. కౌండిన్య నది మీద వక్ఫ్ భూముల సమీపంలో ఇసుక తోడుతుంటే ప్రజలు అడ్డుపడ్డారు. ఇసుక తోడేయడంతో భూగర్భజలాలు ఏమాత్రం లేకుండా పోయాయి. దాంతో ప్రస్తుతం పట్టణ వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక అక్రమ రవాణా దారులు ఇప్పుడు సాక్షాత్తు మున్సిపల్ పంపు హౌస్ వద్ద ఇసుకను దర్జాగా తరలిస్తున్నారు. వైకాపా ప్రభుత్వ కాలంలో ఇక్కడ ఇసుకను విచ్చలవిడిగా తరలించారు. పక్కనే ఉన్న ఒక ప్రైవేటు భూమిలో కూడా ఇసుకను తోడేస్తున్నారు. ఇప్పటికే కౌండిన్య నదిలో పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల పరిధిలోని 11 చెక్ డ్యాంలను ఇసుక కోసం కూల్చేసిన సంగతి విదితమే. క్యాటిల్ ఫారం వద్ద అటవీ శాఖ భూమిలోని ఇసుకను తీసేయడంతో పెద్దపెద్ద వృక్షాలు కూలిపోయాయి. ఇలా నది పొడవునా ఎక్కడా ఇసుక రేణువులు లేకుండా చేసేశారు. ఇప్పుడు పట్టణానికి నీటిని సరఫరా చేసే చోట కూడా ఇసుకను తీస్తున్నారు. కనీసం మున్సిపల్ అధికారులు తమ పరిధిలోని ఇసుక రవాణాను నిలువరించడానికి ప్రయత్నించాల్సిన అవసరం వచ్చింది. సిబ్బందిని పంపి ఇసుక తీయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎన్వీరమణారెడ్డి తెలిపారు. రెవెన్యూ అధికారుల సహకారం తీసుకుని పూర్తిగా నివారించడానికి ప్రయత్నిస్తామని చెప్పారు.


పంప్‌హౌస్ వద్ద ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక



చెన్నై-ముంబయి జాతీయ రహదారిలో నిరుపయోగంగా ఉన్న విశ్రాంతి గది



చిన్నేపల్లె వద్ద బస్‌షెల్టర్ నిర్వహణ లేకపోవడంతో పెరిగిన పిచ్చిమొక్కలు

నిర్లక్ష్యం... నిరుపయోగం

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిలో ప్రయాణించే వారి సౌకర్యార్థం రహదారి ఆనుకుని అక్కడక్కడ విశ్రాంతి గదులు నిర్మించింది జాతీయ రహదారుల శాఖ. అలాగే గ్రామీణ ప్రజలకు బస్సుషెల్టర్లు నిర్మించింది. అయితే వీటి నిర్వహణ గురించి పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. విశ్రాంతి గదుల తలుపులు, కిటికీలు పగులగొట్టి ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారు వీటిని చూసి అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు దూరంగా బస్సుషెల్టర్లు నిర్మించడంతో ఉపయోగంలేకుండా పోయాయి. మద్యం తాగేవారికి అనువుగా మారాయి. జాతీయ రహదారుల శాఖ అధికారులు వీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

తెలుగుభాషా సేవకు సత్కారం


తులసినాథంనాయుడు దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

పలమనేరు, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథంనాయుడును కడప జానుమద్ది కళాపీఠం సభ్యులు సన్మానించారు. ఆదివారం కడపలోని సి.పి.బ్రౌన్ గ్రంధాలయంలో జానుమద్ది హనుమశాస్త్రి శతజయంతి సందర్భంగా ప్రసంశాపత్రాన్ని అందించారు. హైకోర్టు న్యాయమూర్తి బొప్పూడి కృష్ణమోహన్ కళాపీఠం సభ్యులు తులసినాథంనాయుడు ఆయన భార్య పుష్పను సన్మానించారు. తెలుగుభాషకు ఆయన చేస్తున్న సేవను గుర్తించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ అధికార భాషా సంఘం అధ్యక్షులు ఆవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, నిర్వాహకులు జానుమద్ది విజయభాస్కర్, పద్మశ్రీపురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, బ్రహ్మశ్రీ గండ్లూరి దత్తాత్రేయశర్మ, దామోదరనాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పుంగనూరు-మదనపల్లె రోడ్డ బైపాస్ కూడలిలో ఆదివారం ఆర్టీసీ బస్సును ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు వివరాల మేరకు.. పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన యువకులు ధనుష్ కుమార్, మహేష్, ప్రవీణ్ ద్విచక్రవాహనంపై వెళ్తూ ఎదురుగా పుంగనూరువైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. ప్రమాదంలో ముగ్గరూ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు.

మాజీ ఎంపీపీకి జీవితకాల సాఫల్య పురస్కారం


జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్న మాజీ ఎంపీపీ కృష్ణవేణి

బైరెడ్డిపల్లె: తిరుపతి మహతి కళాక్షేత్రంలో ఆదివారం వే ఫౌండేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కళా ఉత్సవంలో బైరెడ్డిపల్లె మాజీ ఎంపీపీ కృష్ణవేణి జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్నారు. మాజీ ఎంపీపీ కృష్ణవేణి విద్య, వ్యాపార, రాజకీయ, సేవా రంగాల్లో 37 ఏళ్లుగా ఎనలేని సేవలు అందించారు. ఈమె సేవలను గుర్తించిన వే ఫౌండేషన్ నిర్వాహకులు జీవితకాల సాఫల్య పురస్కారానికి ఎంపిక చేశారు.

మరమ్మతులకు నోచని వల్లిగట్ల సోమప్ప చెరువు


నాలుగేళ్ల క్రితం తెగిపోయిన వల్లిగట్ల సోమప్ప చెరువు

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దచెరువుల్లో వల్లిగట్ల సోమప్ప చెరువు ఒకటి. ఈ చెరువు విస్తీర్ణం 125 ఎకరాలు. ఆయకట్టు 200 ఎకరాలకు పైగా ఉంటుంది. కందూరు నదిలో వచ్చే నీటి ప్రవాహంతో చెరువు నిండుతుంది. నాలుగేళ్ల క్రితం భారీ వర్షాలకు చెరువు తెగిపోయింది. చెరువు కట్టకింద ఉన్న రైతుల పొలాలు రాళ్లతో నిండిపోయాయి. ఏళ్లు గడుస్తున్న చెరువు మరమ్మతు చేయకపోవడంతో పొలాలు బీళ్లుగానే ఉన్నాయి. ఈ ప్రభుత్వంలోనైనా చెరువుకు మరమ్మతులు చేస్తే పంటలు సాగుచేసుకొంటామని రైతులు అంటున్నారు.

జల్లెడ కాదు.. సాలెగూడు



పచ్చని చెట్ల మధ్య జల్లెడలాంటి సాలిగూడు చూడముచ్చటగా కనిపిస్తోంది. సాలిపురుగు దారంలా జిగురును ద్రవింపజేసి అల్లుకున్న గూడు చూపరులకు కనువిందు కల్గిస్తోంది. వలయాకారంలో అల్లుకున్న వరుసల మధ్య వ్యత్యాసం లేకుండా నిర్మించుకున్న సాలిగూడు నైపుణ్యం ఇంజనీర్ల మేధస్సుకు దర్పణం పడుతోంది. లక్కనపల్లె సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద ఆకట్టుకుంటున్న సాలిగూడు దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్ మనిపించింది.

న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

వరి పైరుకు అనువుగా వర్షాలు

పుంగనూరు: వాయుగుండం బలహీనపడుతోందన్న వార్తతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. జిల్లాలో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలు వరి పంటకు అనువుగా ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు. పడమటి మండలాల్లో వరిసాగు చేయడం ప్రత్యేకం. ఎందుకంటే ఏటా వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, జీవనదులు, ప్రాజెక్టులు లేకపోవడంతో వరి సాగునే రైతులు మరచిపోయారు. ఈ పరిస్థితుల్లో మే, జూన్‌లో ఓ మోస్తారు వర్షాలు కురవడంతో బోరు బావుల్లో నీటిమట్టం పెరిగింది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో వరి రైతుల్లో ఆందోళన నెలకొంది. రెండేళ్లతో పోల్చుకుంటే ఈ ఖరీఫ్‌లో వరి సాగు ఆశాజనకంగా ఉంది. పంట పొట్ట కర దశలో ఉన్నప్పుడు వర్షాలు రావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఎక్కడ భారీ వర్షాలు కురిసి పంట నీట మునిగిపోతుందోనని ఆందోళనలో ఉన్న రైతులు సాధారణ వర్షం కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పొట్ట దశలో ఉన్న వరి పంట త్వరగా పక్వ దశకు వస్తోందని రైతులు అభిప్రాయపడుతున్నారు. చెరువులు, కుంటల కింద వరి సాగు చేసినా బోరు బావుల ఆధారంతోనే చేపట్టారు. బోరుబావుల్లో వచ్చే నీళ్లు, 7 గంటల విద్యుత్తుతో పూర్తిస్థాయిలో తడి పెట్టలేని స్థితిలో వర్షాలు అనువుగా కురిశాయని రైతులు హర్షిస్తున్నారు. నియోజకవర్గంలో వరి సాధారణ సాగు 2,917 హెక్టార్లు కాగా 3,824 హెక్టార్లలో సాగైంది.

● **భారీ వర్షాలైతే నష్టమే:** ఇప్పటి వరకు వరి పంటకు ఎలాంటి నష్టం లేదు. ఇకపై భారీ వర్షాలు, ఎడతెరపిలేకుండా జల్లులు కురిసినా నష్టమే. కాకపోతే ఈ నాలుగు రోజులు కురిసిన వర్షాలు వరి పైరుకు అనుకూలంగా ఉన్నాయి. పైరు ఏపుగా పెరగడంతో పాటు నాణ్యత, దిగుబడి పెరుగుతోంది.
– నారాయణ, వరి రైతు

● **రబీలో వరి సాగు వద్దు:** ప్రస్తుతం వర్షాలు ఆశాజనకంగా కురుస్తుడడంతో రబీలో కూడా వరి సాగు చేయాలనే ఆలోచనను రైతులు విరమించుకోవాలి. చెరువుల్లో నీరు లేని కారణంగా భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉంది. రబీలో వర్షాలు వస్తాయనే నమ్మకం ఉండదు. రబీలో బోరు బావుల ద్వారా ఆరుతడి పంటలు సాగు చేయడం లాభదాయకం.
– శివకుమార్, ఏడీఏ, పుంగనూరు


పుంగనూరు సమీపంలో ఏపుగా పెరిగిన వరి పైరు

మండలాల వారీగా వరి సాగు వివరాలు

మండలం	సాధారణ సాగు హెక్టార్లలో	వాస్తవంగా సాగు హెక్టార్లలో
పుంగనూరు	632	1,015
చౌడేపల్లె	477	836
సోమల	724	613
సదుం	477	595
పులిచర్ల	283	285
రొంపిచర్ల	324	480